

ఆయోడిన్ లోప వారోత్సవ పోస్టర్లను ఆవిష్కరించిన డీఎంహెచ్‌వో మురళీధర్

## లక్ష్యసాధనకు కృషి చేయాలి

### డీఎంహెచ్‌వో మురళీధర్

తొర్రూరు, అక్టోబర్ 22 : ఆరోగ్య కార్యక్రమాల నిర్వహణలో వైద్య, ఆరోగ్య సిబ్బంది లక్ష్య సాధనకు కృషి చేయాలని జిల్లా వైద్యాధికారి జీ మురళీధర్ అన్నారు. మంగళవారం ఆయన తొర్రూరులో వైద్య, ఆరోగ్య సిబ్బందితో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రపంచ ఆయోడిన్ లోప రుగ్మతల నివారణ వారోత్సవ అవగాహన కార్యక్రమ పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటింటి సర్వే, ప్రత్యేక వైద్య శిబిరాల ద్వారా సీజనల్ వ్యాధులను కట్టడి చేయగలిగామన్నారు. అలాగే లక్ష్య సాధన కోసం ప్రతి వైద్యుడు, సిబ్బంది అంకితభావంతో పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి డాక్టర్ సారంగం, ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ నాగేశ్వర్‌రావు, డాక్టర్ సుధీర్‌రెడ్డి, జిల్లా డిప్యూటీ మాస్ మీడియా అధికారి ప్రసాద్, డీపీఎంవోలు రవీందర్‌రావు వనాకర్, సబ్ యూనిట్ అధికారి రామకృష్ణ, శ్రీరామ్ పాల్గొన్నారు.



మడిపెల్లిలోని ఆకేరు వాగులో పట్టపగలే ట్రాక్టర్లలో ఇసుక తరలింపు

## పట్టపగలే ఇసుక అక్రమ రవాణా

తొర్రూరు, అక్టోబర్ 22 : మండలంలోని మడిపెల్లి గ్రామ శివారులోని ఆకేరు వాగు నుంచి పట్టపగలే జోరుగా ఇసుక అక్రమ దందా కొనసాగుతున్నది. వందల కొద్ది ట్రాక్టర్లతో రాత్రి పగలు అనే తేడాలేకుండా ఇసుక రవాణా చేస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇసుక అక్రమ వ్యాపారాన్ని కట్టడి చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## బాధిత కుటుంబాలకు పరామర్శ

కురవి, అక్టోబర్ 22 : మండలంలోని సూధనపల్లి, బలపాల గ్రామాల్లో బాధిత కుటుంబాలను డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ మంగళవారం పరామర్శించారు. సూధనపల్లి గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న నాయనబోయిన పిచ్చమ్మను పరామర్శించారు. రెండు రోజుల క్రితం కురవి శివారు మూడుగుడిసెల తండా వద్ద రోడ్డు ప్రమాదంలో మరణించిన నీలం నర్సయ్య కుటుంబాన్ని ఓదార్చారు. బలపాల లింగ్యాతండాలో కిడ్నీ సమస్యతో బాధపడుతున్న మాలోత్ బిచ్చను పరామర్శించారు. బలపాల మాజీ ఎంపీటీసీ లింగ్యానాయక్ తల్లి పెద్ద కర్మ తండాలో మంగళవారం జరగగా, రెడ్యానాయక్ పాల్గొని చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఆయన వెంట జిల్లా నాయకులు బజ్జూరి పిచ్చిరెడ్డి, యూత్ రాష్ట్ర నాయకుడు గుగులోత్ రవినాయక్, కన్నెగంటి వెంకటరమణ, చెన్నా రెడ్డి, గాండ్ల లింగయ్య, వెంకన్న, రామలింగం, రాజు, నామ సైదులు, రాంలాల్, రిటైర్డ్ టీచర్ వస్యనాయక్ పాల్గొన్నారు.

## తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ సమాఖ్య జిల్లా కార్యదర్శిగా ఉపేందర్

మహబూబాబాద్ రూరల్, అక్టోబర్ 22 : తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ సమాఖ్య (టీడబ్ల్యూజేఎఫ్) జిల్లా కార్యదర్శిగా బోనగిరి ఉపేందర్ నియామకమయ్యారు. మంగళవారం పట్టణంలోని రాజీవ్ నగర్ కాలనీలో నిర్వహించిన సమావేశంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ సమాఖ్య జిల్లా అధ్యక్షుడు మట్టూరి నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ.. గతంలో జిల్లా కార్యదర్శిగా పని చేసిన కొమ్మనబోయిన యాకయ్య ఓ రాజకీయ పార్టీలో పని చేస్తున్నందున అతడి స్థానంలో ఉపేందర్‌ను నియమించిట్లు తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**CHANGE OF NAME**

★I, GOPALAPU VENKATESHWAR RAO (New Name), previously called GOPALAPU VENKATESHWARLU (Old Name), and R/o H.No. 1-84, Gunturpally, Sangem Mandal, Warangal Dist., TG., India, and solemnly declare.
NTW-000

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

# మహిళా భవనంలో ‘ఆర్‌అండ్‌బీ’

- తాత్కాలికంగా ఆరు నెలల కోసం కేటాయింపు
- ఏడాది దాటినా ఖాళీ చేయని అధికారులు
- వీవో సమావేశాలకు మహిళల ఇబ్బంది
- అంగడి షెడ్డులో నిర్వహణ
- ఖాళీ చేయాలని అడిగినా పట్టించుకోని అధికారులు



గూడూరు మండల కేంద్రంలోని అంగడి షెడ్డులో మహిళల సమావేశం



మహిళా భవనంలో ఆర్‌అండ్‌బీ కార్యాలయం

గూడూరు, అక్టోబర్ 22 : మండల కేంద్రంలోని మహిళా భవనాన్ని తాత్కాలికంగా ఆరు నెలల కోసం ఆర్ అండ్ బీ కార్యాలయానికి కేటాయించారు. అయితే, ఏడాది దాటినా ఆ శాఖ అధికారులు భవనాన్ని ఖాళీ చేయకపోవడంతో మహిళా సంఘాలు ఇబ్బందిపడుతున్నాయి. ఎండలో ఎండుతూ, వానలో తడుస్తూ మహిళా సంఘం ముందున్న అంగడి మైదానంలో షెడ్డులో తమ కార్యకలాపాలు నిర్వహించుకుంటున్నారు. గూడూరు మండల కేంద్రంలోని స్థానిక అంగడి మైదానం పక్కనే మహిళా బ్యాంకు పేరుతో 12 సంవత్సరాల క్రితం మహిళలకు భవనాన్ని నిర్మించారు. గతంలో ఈ భవనంలో కొద్ది రోజులపాటు సీహెచ్‌సీ దవాఖానను నిర్వహించారు. తిరిగి 8 సంవత్సరాల క్రితం డ్వాక్రా మహిళలకు అప్పగించగా, గూడూరు గ్రామ మహిళలు తమ వీవో సమావేశాలతోపాటు డ్వాక్రా గ్రూపు మహిళలకు శిక్షణ, తదితర కార్యకలాపాలకు ఈ భవనాన్ని ఉపయోగించుకుంటున్నారు. కాగా, గత ప్రభుత్వం మండలంలో సబ్ డివిజన్ కార్యాలయాలు ఏర్పాటు చేసేందుకు కొన్ని ప్రభుత్వ కార్యాలయాలను ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా తాత్కాలికంగా ఆరునెలల కోసం మహిళా భవనాన్ని ఆర్‌అండ్‌బీ శాఖకు కార్యాలయానికి అప్పటి పీడీ కేటాయించారు. అయితే, ఆరునెలలు దాటి, సంవత్సరం గడుస్తున్నా ఈ కార్యాలయాన్ని అర్‌అండ్‌బీ శాఖ ఖాళీ చేయడం లేదు. తమ భవనాన్ని ఖాళీ చేయాలని చెప్పినా అర్‌అండ్‌బీ శాఖ పట్టించుకోవడంలేదని ఐకేపీ ఉద్యోగి ఒకరు తెలిపారు.

# అమరుల త్యాగాలను స్మరించుకోవాలి

- ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్
- పట్టణంలో కొవ్వొత్తులతో ర్యాలీ



మహబూబాబాద్ పట్టణంలో కొవ్వొత్తులతో పోలీసుల ర్యాలీ

మహబూబాబాద్ రూరల్, అక్టోబర్ 22 : పోలీస్ అమరుల త్యాగాలను స్మరించుకోవాలని ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ అన్నారు. పోలీస్ అమరుల వారోత్సవాల సందర్భంగా మంగళ వారం రాత్రి పట్టణంలోని ఎమ్మార్వో సెంటర్, నెహ్రూ సెంటర్ మీదుగా అంబేద్కర్ సెంటర్ వరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భం గా ఎస్పీ మాట్లాడుతూ.. పోలీసుల సేవ ప్రతి ఒక్కరికీ అవసరమన్నారు. కొంత కష్టమైనా ప్రజారక్షణ కోసం పని చేస్తున్నారని అన్నారు. ఇందులో ఎన్నో త్యాగాలు సైతం ఉంటాయని చెప్పారు. నిరంతరం ప్రజాసేవలో ఉంటూ రక్షణ కల్పించేది ఒక్క పోలీసులు మాత్రమేనని, వారి త్యాగాలను ఎప్పటికీ మరువొద్దన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ తిరుపతి రావు, సీఐలు ఎస్సైలు, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

**అమరుల త్యాగాలు మరువలేనివి**

దంతాలపల్లి : విధి నిర్వహణలో అమరులైన పోలీసుల త్యాగాలు మరవలేనివని ఎస్సై పిల్లల రాజు అన్నారు. దంతాలపల్లి పోలీసులు పోలీస్ అమరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా మంగళవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ నుంచి అంబేద్కర్ సెం టర్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలి

### కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్



డోర్నకల్ : అభివృద్ధి పనుల నివేదికను పరిశీలిస్తున్న కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్

డోర్నకల్, అక్టోబర్ 22: ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అభివృద్ధి పనులు పూర్తి చేయాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అన్నారు. మంగళవారం ఆయన డోర్నకల్ మున్సిపాలిటీ పరిధిలోని యాదవ్‌నగర్, టీచర్స్ కాలనీ, ముత్యాలమ్మ గుడి రోడ్డు, భగత్‌సింగ్ విగ్రహం సెం టర్, బతుకమ్మ పార్కులో మున్సిపల్ కమిషనర్, సంబంధిత అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పన్నుల వసూలు లక్ష్యం పూర్తి చేయాలని, తద్వారా పట్టణాల అభివృద్ధి వేగవంతం అవుతుందన్నారు. పచ్చదనం, పరిశుభ్రత, తడి పొడి చెత్త సేకరణపై ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నరేశ్‌రెడ్డి, వైస్ చైర్మన్ కోటిలింగం, పబ్లిక్‌హెల్త్ డీఈ నవీన్, ఎంపీడీవో శ్రీనివాసరావు, డీటీ వీరన్న పాల్గొన్నారు.

**మున్సిపల్ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్**

మరిపెడ: మరిపెడ మున్సిపల్ కేంద్రాన్ని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ మంగళవారం సందర్శించారు. టీఎస్ ఎఫ్ఐడీసీ నుంచి మున్సిపల్ అభివృద్ధి కోసం రూ.10కోట్లు మంజూరు కాగా, చేపట్టాల్సిన పనులపై సంబంధిత అధికారులతో కలెక్టర్ మాట్లాడారు. అనంతరం హైవే, రాజీవ్ సెంటర్, కార్గిల్ చౌరస్తా, మాకుల చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మున్సిపల్ కేంద్రంలో శానిటేషన్ పనులు నిర్వహించడంతో పాటు పచ్చదనం, పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. పన్నులు వసూలు చేసి పట్టణాన్ని అభివృద్ధి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటస్వామి పాల్గొన్నారు.

## సస్పెండ్ చేసిన ఏఈవోలను విధుల్లోకి తీసుకోవాలి



రైతువేదిక వద్ద నల్లబ్యాడ్జిలతో ఏఈవోల నిరసన

మహబూబాబాద్ రూరల్, అక్టోబర్ 22 : రాష్ట్ర ప్రభుత్వం అకారణంగా సస్పెండ్ చేసిన (వ్యవసాయ విస్తరణ అధికారులు) ఏఈవోలను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని మానుకోట ఏఈవోల జాక్ ప్రెసిడెంట్ రాజు అన్నారు. ఈ మేరకు మంగళవారం పట్టణ శివారులోని గుమ్మడూరు రైతువేదిక వద్ద ఏఈవోలు నల్లబ్యాడ్జిలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో డిజిటల్ క్రాప్ సర్వే చేయని 160 మంది ఏఈవోలను సస్పెండ్ చేసినట్లు తెలిపారు. డీసీఎస్ వల్ల పనిభారం పడుతుందని, ఇది రెవెన్యూ విభాగానికి సంబంధించినదన్నారు. జాక్ పిలుపు మేరకు నేటి నుంచి పెన్‌డౌన్ కార్యక్రమం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జాక్ జనరల్ సెక్రటరీ శ్రీనివాస్, వైస్ ప్రెసిడెంట్ వినోద్, సాయి చరణ్ పాల్గొన్నారు.

## బీసీ రాజ్యాధికార సమితి జిల్లా అధ్యక్షుడిగా వీరేందర్

మహబూబాబాద్ రూరల్ : బీసీ రాజ్యాధికార సమితి జిల్లా అధ్యక్షుడిగా గండి వీరేందర్‌గౌడ్ నియామకమయ్యారు. మంగళవారం హైదరాబాద్‌లో రాష్ట్ర అధ్యక్షుడు సురేశ్ నియామకపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రాజేందర్‌గౌడ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కుమారస్వామి, వెంకన్న, శేఖర్ పాల్గొన్నారు.

## అనుమతి లేని ఎరువులు విక్రయించొద్దు

గార్ల : ఎరువులు, పురుగు మందు దుకాణాల యజమానులు అనుమతి లేని ఎరువులు, పురుగు మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయశాఖ ఏడీవో విజయనిర్మల హెచ్చరించారు. మంగళవారం ఆమె మండల కేంద్రంలోని ఎరువులు, పురుగుమందుల దుకాణాలు, సొసైటీ గోదామును తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. నిబంధనలు పాటించని డీలర్లపై శాఖాపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఆమె వెంట మండల వ్యవసాయ అధికారి రామారావు ఉన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

నెల్లికుదురు, అక్టోబర్ 22 : రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలో మంగళవారం జరిగింది. ఎస్సై రమేశ్‌బాబు కథనం ప్రకారం.. ఆలేరు గ్రామానికి చెందిన కోరే హరీశ్ తన తండ్రి బీరయ్య కలిసి స్కూటీపై ఆలేరు స్టేజీ నుంచి గ్రామానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో ఆలేరు నుంచి ఆలేరు స్టేజీ వైపునకు వెళ్తున్న గ్రీన్ ఫీల్డ్ హైవేలో పనిచేస్తున్న ఓ వాహనం అతి వేగంగా స్కూటీని ఢీ కొట్టింది. దీంతో స్కూటీపై నున్న తండ్రి, కొడుకుకు తీవ్ర గాయాలు కాగా, స్థానికులు 108 వాహనంలో మహబూబాబాద్ ఏరియా వైద్యశాలకు తరలించారు. పెద్ద కొడుకు నవీన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## ఐదుగురి రిమాండ్

చిన్నగూడూరు : మండలంలోని ఉగ్గంపల్లి గ్రామంలో దసరా పండుగ రోజు రెండు వర్గాల మధ్య ఘర్షణలో 15మందిపై కేసు నమోదు చేశామని ఎస్సై ఝాన్సీ తెలిపారు. ఇరువర్గాలకు చెందిన 15మందిపై కేసు నమోదు చేశామని, వారిలో ఒక వర్గానికి చెందిన ఐదుగురిని మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు ఆమె తెలిపారు.

## స్పోర్ట్స్ మెటీరియల్ అందజేత

డోర్నకల్, అక్టోబర్ 22 : తెలంగాణ ఉద్యమకారుడు మామిడి నాగరాజు కొడుకు వివేక్ పుట్టిన రోజు సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలోని రాజుతండా కేజీబీవీ పాఠశాల విద్యార్థులకు మంగళవారం రూ.4వేల విలువ చేసే స్పోర్ట్స్ మెటీరియల్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా అష్పాకుల్లా ఖాన్ జయంతి

మహబూబాబాద్ రూరల్, అక్టోబర్ 22 : స్వాతంత్ర్య సమరయోధుడు, పండిట్ అష్పాకుల్లాఖాన్ జయంతిని మంగళవారం పట్టణంలో నేతాజీ సేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నేతాజీ సేవా సమితి జిల్లా అధ్యక్షుడు నాగరాజు, షేక్ యూసుఫ్, వివేక్, గంగాధర్, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, రామకృష్ణ, శోభన్, నితిన్ పాల్గొన్నారు.

## కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

తొర్రూరు, అక్టోబర్ 22 : మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరుతూ సీఐటీయూ అనుబంధ తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం తొర్రూరు మున్సిపల్ కమిషనర్ శాంతికుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు కొమ్ము దేవేందర్, సీఐటీయూ జిల్లా నాయకుడు అశోక్ మాట్లాడుతూ.. మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 25న సీడీఎంఏ ఆఫీస్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నామని, మున్సిపల్ కార్మికులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల నాయకులు సాంబయ్య, యాకన్న, సోమన్న, శంకర్, వెంకన్న, రాజశేఖర్, శ్యామ్, భిక్షపతి, నర్సమ్మ, చంద్రమ్మ, సుగుణమ్మ, రాములమ్మ, నాగలక్ష్మి పాల్గొన్నారు.

## సొసైటీలో అక్రమాలపై విచారణ జరపాలి

బయ్యారం : బయ్యారం సహకార పరపతి సంఘంలో అక్రమాలపై విచారణ చేపట్టాలని మహిళా రైతు, అడ్వకేట్ రజిని కోరారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ... బయ్యారం సొసైటీలో రైతులకిచ్చే రుణాల విషయంలో అవకతవకలు జరిగాయని, రైతులకు తెలియకుండానే వారి పేరు మీద రుణాలు తీసుకున్నారని ఆరోపించారు. సొసైటీలో అక్రమాలపై కలెక్టర్ కూడా ఫిర్యాదు చేశామన్నారు. సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, రైతులకు న్యాయం చేయాలని కోరారు.

## బకాయిలు చెల్లించాలి..

పెద్దవంగర, అక్టోబర్ 22 : ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం చిట్యాల పాఠశాలలో టీపీయూఎస్ సంఘం నాయకులు, ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జిలు ధరిం చి నిరసన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలు, పీఆర్సీ బకాయిలను వెంటనే చెల్లించాలన్నారను. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం విజయ్ కుమార్, ఉపాధ్యాయులు యాకయ్య, ఉపాధ్యాయ సంఘం నాయకులు పాల్గొన్నారు.



డోర్నకల్ ఎస్సీ బాలుర వసతిగృహంలో వసతులు పరిశీలిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్

## విద్యార్థులకు అసౌకర్యం కలిగించొద్దు

డోర్నకల్, అక్టోబర్ 22 : వసతి గృహాల్లో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలిగించొద్దని జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో అన్నారు. మంగళవారం ఆయన డోర్నకల్‌లోని మైనార్టీ పాఠశాల, ఎస్సీ బాలురు వసతి గృహం, ఎస్టీ బాలురు హాస్టల్, గ్రంథాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. మైనార్టీ పాఠశాలలో తరగతి గదులు, మరుగుదొడ్లు, డైనింగ్‌హాల్‌ను పరిశీలించి శుభ్రంగా ఉంచాలని అక్కడి సిబ్బందిని ఆదేశించారు. అనంతరం ఎస్సీ బాలురు వసతి గృహంలో డిజిటల్ లైబ్రరీ, ఓపెన్ జిమ్, వంట గది, మరుగుదొడ్లు, ఎస్టీ హాస్టల్‌లో మరుగుదొడ్లు, డైనింగ్‌హాల్, వంట గది, డోర్నకల్ పట్టణంలో లైబ్రరీ పరిశీలించారు. తాగునీరు, పోటీ పరీక్షల పుస్తకాలు అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నరేశ్‌రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసరావు, డీటీ వీరన్న, వార్డెన్ స్వామి పాల్గొన్నారు.

## అసంపూర్తి పనులను పూర్తిచేయాలి

కురవి, అక్టోబర్ 22 : ‘మన ఊరి– మన బడి’ అసంపూర్తి పనులను తక్షణమే పూర్తిచేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ పట్ల మధు డిమాండ్ చేశారు. ఈ మేరకు కురవి మండల కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ వద్ద మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. టాయిలెట్స్ పనులు అసంపూర్తిగా ఉండడం వల్ల విద్యార్థినులు ఇబ్బంది పడుతున్నారని, త్వరగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కో కన్వీనర్ గంధసిరి జ్యోతిబసు, మండల అధ్యక్షుడు వీరేందర్, అఖిల్, ఉజ్వల్, నరేశ్, మహేశ్ పాల్గొన్నారు.

## అనారోగ్యంతో బాలుడు మృతి

కేసముద్రం, అక్టోబర్ 22 : మండలంలోని సబ్‌స్టేషన్‌తండాకు చెందిన గుగులోత్ జయంత్(2) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. తండాకు చెందిన హరీశ్, కస్తూరీ దంపతులకు కుమార్తె, కుమారుడు జయంత్ ఉన్నారు. 6 నెలల క్రితం జయంత్ అనారోగ్యానికి గురైనాడు. పరిస్థితి విషమించి మృతి చెందాడు. కొడుకు మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమయ్యారు.

## మోటర్లకు కెపాసిటర్లు అమర్చాలి

కేసముద్రం, అక్టోబర్ 22 : మోటర్లకు కెపాసిటర్లు అమర్చి విద్యుత్ వృథాను అరికట్టాలని మహబూబాబాద్ ట్రాన్స్‌కో డీఈ విజయ్ అన్నారు. పొలంబాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన విద్యుత్ వినియోగంపై రైతులకు సూచనలు చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ ఫ్యూజ్ పోతే వెంటనే విద్యుత్ శాఖ అధికారులకు తెలపాలన్నారు. వానకాలంలో కరెంటు స్తంభాలను పట్టుకోవద్దని సూచించారు. ఇంటి వద్ద బట్టలు ఆరేసేందుకు దండాలకు ఇనుప తీగలు వాడొద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీ అయిలయ్య, ఏఈ రాజు, సిబ్బంది రవి, తిరుపతిరెడ్డి, అమరేందర్, సుమన్, రైతులు సోమన్న, మోడెం రాజు, జానీ, భరత్ పాల్గొన్నారు.

## ప్రత్యామ్నాయం వైపు మొగ్గు చూపాలి

దంతాలపల్లి, అక్టోబర్ 22 : జాతీయ ఆహార భద్రత పథకంలో భాగంగా రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపాలని ఎన్ఎఫ్ఎస్ఎం ఉమ్మడి జిల్లా కన్సల్టెంట్ సారంగం తెలిపారు. మండలంలో వివిధ గ్రామాల రైతులకు జాతీయ ఆహార భద్రత పథకం కింద వచ్చిన పొద్దు తిరుగుడు విత్తనాలను పంపిణీ చేశారు. అనంతరం వేరు శనగ పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ రవి, మండల వ్యవసాయ అధికారి వాహిని, ఏఈవోలు పాల్గొన్నారు.

## కళాకారుల విభాగం జిల్లా కన్వీనర్‌గా భద్రయ్య

గూడూరు, అక్టోబర్ 22 : జిల్లా కళాకారుల విభాగం కన్వీనర్‌గా గూడూరు మండలం పొనుగోడు గ్రామానికి చెందిన మేరుగు భద్రయ్యను నియమించినట్లు సంఘం రాష్ట్ర కన్వీనర్ యెల్ల పోశెట్టి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తనను తెలంగాణ ఫోరం జిల్లా కళాకారుల విభాగం కన్వీనర్‌గా నియమించిన రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, పోశెట్టికి భద్రయ్య కృతజ్ఞతలు తెలిపారు.

## రోడ్డుపై దిగబడిన లారీ

చిన్నగూడూరు : ఉగ్గంపల్లి గ్రామ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద రోడ్డుపై లోడ్‌తో వెళ్తున్న లారీ మంగళవారం దిగబడింది. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. ఉగ్గంపల్లి–ఎల్లంపేట ఆర్‌అండ్‌బీ రోడ్డు పునరుద్ధరణ పనులను రెండేండ్ల క్రితం చేపట్టారు. కానీ, కాంట్రాక్టర్ సుమారు వంద మీటర్ల దూరం కంకరపోసి వదిలేయడంతో రోడ్డుపై గుంతలు పడి భారీ వాహనాలు వెళ్లడం ఇబ్బందిగా మారింది.

## రేపు జాబ్ మేళా

మహబూబాబాద్ రూరల్, అక్టోబర్ 22 : జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో ఈ నెల 24న జాబ్ మేళాను నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి రజిత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రికెట్ ఆక్సెస్ గ్రామీణ లిమిడెట్ కంపెనీ హైదరాబాద్ వారు అర్హత గల వారిని ఎంపిక చేస్తారని, అభ్యర్థులు ఇంటర్, ఐటీఐతోపాటు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. మరింత సమాచారం కోసం 8523098024 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

## ఉద్యమాలతో సమస్యలు పరిష్కారం

మహబూబాబాద్ రూరల్, అక్టోబర్ 22 : ఉద్యమాలతోనే ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయని సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో మూడోసారి అధికారంలోకి బీజేపీ ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి, అమలు చేయడం లేదన్నారు. ఎన్నికలకు ముందు గెలవడం కోసం అనేక వాగ్దానాలు ఇచ్చి, ఇప్పుడు వాటిని గాలికొదిలిందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాల్సిన ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు తాకట్టు పెడుతున్నదన్నారు. ఈ కార్యక్రమంలో సూర్ణపు సోమయ్య, హేమా నాయక్, శ్రీనివాస్, వెంకన్న పాల్గొన్నారు.

## ఘనంగా ఎస్ఆర్ శంకరన్ జయంతి

మహబూబాబాద్ రూరల్, అక్టోబర్ 22 : దళిత, గిరిజన పీడిత ప్రజల ఆశాజ్యోతి ఎస్ఆర్ శంకరన్ అని గిరిజన సామాజిక చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు గుగులోత్ కిషన్‌నాయక్ అన్నారు. మంగళవారం పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద శంకరన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రామ్మూర్తి, సత్యనారాయణ, శ్రీధర్, రాంచందర్, గణేశ్ పాల్గొన్నారు.

## లెక్చరర్ పోస్టులను భర్తీ చేయాలి

మహబూబాబాద్ రూరల్, అక్టోబర్ 22 : జిల్లాలోని మైనార్టీ కళాశాలల్లో ఖాళీగా ఉన్న లెక్చరర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వెలుగు శ్రావణ్ అన్నారు. ఈ మేరకు మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సరైన ఫ్యాకల్టీ లేక కళాశాల విద్యార్థులు ఇబ్బందిపడుతున్నారని, వెంటనే భర్తీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వెంకన్న, అశోక్, వికాస్ పాల్గొన్నారు.

## పాఠశాలలో ఎంఈవో తనిఖీలు

కేసముద్రం, అక్టోబర్ 22 : మండలంలోని వెంకటరాంతండా పాఠశాలను మంగళవారం ఎంఈవో యాదగిరి తనిఖీ చేశారు. హాజరు పట్టిక, విద్యార్థుల విద్యాసామర్థ్యాన్ని పరిశీలించారు. అంగన్‌వాడీ టీచర్ సక్రమంగా విధులకు హాజరు కావడం లేదని ఎంఈవోకు తండావాసులు ఫిర్యాదు చేశారు. వరంగల్‌లో ఉంటూ ఆలస్యంగా వస్తున్నదన్నారు. వెంటనే స్పందించిన ఎంఈవో అంగన్‌వాడీ టీచర్‌కు ఫోన్ చేయగా, మహబూబాబాద్‌లో మీటింగ్‌కు వెళ్తున్నట్లు తెలిపింది. అంగన్‌వాడీ టీచర్, ఆయా విధులకు హాజరుకాకపోవడంతో ప్రత్యేక అధికారికి ఫిర్యాదు చేసినట్లు ఎంఈవో తెలిపారు.

## క్రీడలను సద్వినియోగం చేసుకోవాలి

తొర్రూరు, అక్టోబర్ 22 : డివిజన్ కేంద్రంలో నిర్వహించే క్రీడలను యువత సద్వినియోగం చేసుకోవాలని తొర్రూరు సీఐ జగదీశ్ సూచించారు. మంగళవారం స్థానికంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 26, 27న నిర్వహించే డబుల్ బ్యాడ్మింటన్ పోటీల్లో తొర్రూరు డివిజన్ పరిధిలోని యువత పాల్గొని విజయవంతం చేయాలన్నారు. గెలుపొందిన వారికి నగదు బహుమతి అందిస్తామన్నారు. వివరాల కోసం 9493 258369, 9603488575 నంబర్లలో సంప్రదించాలన్నారు.

## ఏడుగురి బైండోవర్

నర్సింహులపేట : మండల కేంద్రంలో గుడుంబా విక్రయిస్తున్న ఏడుగురిని మంగళవారం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. ఎక్సైజ్ ఎస్సై తిరుపతి మాట్లాడుతూ.. మండల కేంద్రంలో గుడుంబా విక్రయిస్తున్న ఏడుగురిని తహసీల్దార్ నాగరాజు ఎదుట బైండోవర్ చేశామని, రూ.లక్ష వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేసినట్లు తెలిపారు.

## మిర్చితోట పరిశీలన

బయ్యారం : మండలంలోని సింగారం గ్రామ రైతులకు చెందిన మిర్చి, మక్కజొన్న తోటలను కేవీకే మల్యాల శాస్త్రవేత్తలు మాలతి, క్రాంతి కుమార్ పరిశీలించారు. మిర్చితోటకు సోకే నల్లి, కింది ముడత, పై ముడత, మసిపేనును అరికట్టే విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏవో రంజీనాయక్, బానోత్ శ్రీను, గంగావత్ గోపాల్, గంగావతి భీముడు, ఏఈవో నాగరాజు పాల్గొన్నారు.

## డీఏలు విడుదల చేయాలి

కేసముద్రం : ఉపాధ్యాయులకు రావాల్సిన పెండింగ్ బిల్లులు, ఐదు డీఏలు పీఆర్సీని వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఓమ సంతోష్ అన్నారు. ఉపాధ్యాయ ధర్మాగ్రహ దీక్షలో భాగంగా మంగళవారం కేసముద్రం స్టేషన్ హైస్కూల్‌లో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జిలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాజు, ఉపాధ్యాయులు రమేశ్, రాజేందర్, శ్రీనివాస్, కుమారస్వామి, సత్యనారాయణ, సదయ్య పాల్గొన్నారు.

## కారుణ్య నియామకాలు చేపట్టాలి

కురవి, అక్టోబర్ 22 : తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ కురవి మండల కార్యకర్తల సమావేశం మండల అధ్యక్షుడు గుండ్ల విజయ్‌కుమార్ అధ్యక్షతన మండలంలోని మోద్గులగూడెం ఎంపీపీఎస్‌లో మంగళవారం జరిగింది. ముఖ్యఅతిథిగా జిల్లా ఉపాధ్యక్షుడు బలాస్టి రమేశ్ హాజరై మాట్లాడారు. అధికార పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో చనిపోయిన ఉద్యోగ, ఉపాధ్యాయ కుటుంబాలకు కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. ఆ హామీని నెరవేర్చకపోవడం వల్ల ఆయా కుటుంబాలు ఆర్థిక ఇబ్బంది పడుతున్నాయన్నారు. పెండింగ్‌లో ఉన్న 5 డీఏలను వెంటనే ప్రకటించాలని, పీఆర్సీ నివేదిక తెప్పించుకొని అమలు చేయాలన్నారు. 317 జీవో బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి ఓదెల శివ కుమార్, సబ్ కమిటీ సభ్యులు సీహెచ్ శ్రీనివాస్, గుగులోత్ వెంకన్న పాల్గొన్నారు.

## రూ.26వేల వేతనం ఇవ్వాలి

మహబూబాబాద్ రూరల్ : మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని సీఐటీయూ పట్టణ కార్యదర్శి నాగన్న అన్నారు. ఈ మేరకు మంగళవారం మున్సిపల్ కమిషనర్ రవీందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్‌లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులను వెంటనే పర్మినెంట్ చేయాలని, కనీస పని గంటలను నిర్ణయించాలని కోరారు. ఈ సమస్య పరిష్కారం కోసం ఈ నెల 25న హైదరాబాద్‌లో జరిగే సమావేశాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తోట శ్రీను, చిరంజీవి, వీరన్న, నజీర్ పాల్గొన్నారు.

## సాగును అడ్డుకున్న దళితులు

### కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన భూమిలో లబ్ధిదారులు సాగుకు యత్నం

పెద్దవంగర, అక్టోబర్22: దళితులకు మూడెకరాల భూ పంపిణీలో భాగంగా కేసీఆర్ ప్రభుత్వం పెద్దవంగర గ్రామంలోని 11 మంది దళితులకు మూడెకరాల చొప్పున భూమిని అందించింది. అందులో లబ్ధిదారులు సాగుకు యత్నించగా మిగతా దళితులు అడ్డుకున్నారు. గతంలో కూడా ఇలాగే అడ్డుకోవడంతో లబ్ధిదారులు కోర్టును ఆశ్రయించగా, ఇటీవల సాగుకు అనుమతిచ్చింది. దీంతో వారు తహసీల్దార్‌తో పాటు పోలీస్‌స్టేషన్‌లో వాటి కాపీలను అందించారు. కొన్ని రోజులుగా భూమి సాగు చేయకపోవడంతో వాటిలో ఉన్న చెట్లను కర్ర వ్యాపారికి విక్రయించగా, కర్రతో ఉన్న ట్రాక్టర్‌ను లబ్ధిపొందని వారు అడ్డుకుని తహసీల్దార్‌కు సమాచారమిచ్చారు. దీంతో కర్రతో ఉన్న ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.